క్లుప్తంగా

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌ఛార్జ్‌గా తనను నియమించడంపై మాజీ ఎంపీ డాక్టర్ డి.వి.జి శంకరరావు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్డ్ తెగల సంక్షేమం, అభివృద్ధి, సాధికారతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను క్షేత్రస్థాయి లబ్ధిదారులకు చేరేలా తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో గిరిసీమల్ని ముందు వరుసలో నిలపాలని ముఖ్యమంత్రి చేస్తున్న బృహత్ ప్రయత్నానికి అందరి సంపూర్ణ మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తానన్నారు.

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: ఈనెల 13న స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌ఓలు, రూట్ ఆఫీసర్లు, ఎన్నికల అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా బీఎల్‌ఓలు గ్రామాల్లో పట్టభద్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఓటు వేయడానికి వచ్చేటప్పుడు ప్రతీ ఓటరు తమ గుర్తింపు కార్డులు తీసుకురావాలని సూచించారు. అలాగే భూముల రీసర్వేను వేగవంతం చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు.

నియోజకవర్గంలో 3,137 మంది పట్టభద్ర ఓటర్లు

కురుపాం: ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్‌లో కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 3,137 మంది పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తహసీల్దార్ రాకోటి రమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కురుపాం మండలంలో 582 మంది, గుమ్మలక్ష్మీపురంలో 608 మంది, జియ్యమ్మవలసలో 596 మంది, గరుగుబిల్లిలో 723 మంది, కొమరాడలో 628 మంది మొత్తం 3,137 మంది ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు పోలింగ్ జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఓటర్లు తమ ఓటరు గుర్తింపుకార్డు తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు.

20 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని నడిమిబుడగరాయి పరిసరాల్లో పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. సవర సోమేశ్వరరావు అనే వ్యక్తి వద్ద 20 లీటర్ల సారా పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠరావు తెలిపారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

డీలర్ కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు

భామిని: మండలంలోని బాలేరు రేషన్ డీలర్ ఎం.గజపతిరావు(68) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్ల సంఘం సభ్యులు మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్‌ఓ గిరీష్ పట్నాయిక్, డీలర్ల సంఘ గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు వి.రాములు, ఎల్.సంతోష్‌కుమార్, కె.గోవిందరావు, పలువురు డీలర్లు ఉన్నారు.

విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ

సీతంపేట: జనచేతన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మజ్జి శంకరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా మండలంలోని గొయిది గ్రామంలో మంగళవారం ఆ సంస్థ కార్యదర్శి బగాది శశిభూషణ్ చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మాతృభాషలో విద్యాబోధన ద్వారా గ్రామస్థాయిలో పాఠశాలలు నెలకొల్పి సవర భాషలో బోధనకు కృషిచేసిన ఘనత శంకరరెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తౌరిక రత్నాలమ్మ, ఎంఎంఎస్ అధ్యక్షులు బి.సరోజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సాలూరు: మండలంలోని చీపురువలసలో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు, ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాలను ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీసీడీపీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ శాంతేశ్వరరావు, ఏఈఈ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



కురుపాం: మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

- డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్

కురుపాం: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పార్వతీపురం డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళా సంఘాలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ప్రతీ మహిళ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి మరికొంత మంది మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. మహిళా సమాఖ్య ఓబీ, సభ్యులను సన్మానించారు. ఏపీఎం కిశోర్, మహిళలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు ప్రిన్సిపాల్ డి.రామయ్య ఆధ్వర్యంలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ డి.శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓలు వి.పెదరామకృష్ణ,త్రినాథ్‌లు విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తాడికొండ పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు.

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, మహిళా పోలీస్ వసంత నీరజ తదితరులు పాల్గొన్నారు.

రేపటికి ముందడుగు



గుమ్మలక్ష్మీపురం: డిగ్రీ కళాశాల విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సుధాకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



పాలకొండ: సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. పాలవలస నివాస గృహంలో మంగళవారం సాయంత్రం మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్యనాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల వారీగా ఓటర్ల జాబితాలో ఉన్న ప్రతీ ఓటరును కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించాలని సూచించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నానికి అందరూ మద్దతు అందించాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ కనపాకసూర్యప్రకాష్‌రావు, నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, ఎంపీపీ బొమ్మాళి భాను, వ్యవసాయ మండలి కమిటీ చైర్మన్ రణస్థలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వరాయి కళావతి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని పట్టభద్ర ఓటర్లకు వివరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైస్ ఎంపీపీ విశ్వసరాయి భార్గవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కురుపాం: ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భామిని: ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- కురుపాం: మండల కేంద్రంలో ఎంపీపీ శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ బంగారునాయుడు, స్వామియాజులు, శెట్టి నాగేశ్వరరావు, రాయిపల్లి శ్రీధర్, ఆకుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని గరుగుబిల్లి, దళాయివలస, ఉద్దవోలు, ఉల్లిభద్ర, రావుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ ఉరిటి రామారావు ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

భామిని: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహనబాబు తదితరులు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి కలిసి సుధాకర్‌కు తొలిప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

2కోట్ల పనిదినాల కల్పనే లక్ష్యం

- డ్వామా పీడీ రామచంద్రరావు



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ రామచంద్రరావు

పాలకొండ రూరల్: ఉపాధిహామీ పథకం లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పాలకొండ, వీరఘట్టం మండలాల ఉపాధి సిబ్బంది, క్షేత్ర సహాయకులతో మంగళవారం సమీక్ష చేపట్టారు. పంచాయతీల వారిగా 2022–23లో చేపట్టిన పనులు, పెండింగ్ పనులపై ఆరాతీశారు. నిర్ణీత గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే 2023–24 ఏడాదికి సంబంధించి చేపడుతున్న పనుల విషయంలో సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. వేతనదారుల ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలన్నారు. సగటు వేతనం రూ.257 వచ్చేలా, వలసలు నివారించేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో సర్పంచుల సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మస్తర్లు నమోదు చేయాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాజా ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా ఒక్కో మండలంలో దాదాపు 12 వందలకు పైబలుకు పనులు జరిగేలా చూస్తామన్నారు. 15 మండలాల్లో రమారమి 22,286 పనులు గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేతనదారులకు రెండు కోట్ల పనిదినాలు కల్పించటమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆయనతో పాటు ఏపీడీ శ్రీహరి తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయం..ఆరోగ్యానికి రక్ష

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయం మన ఆరోగ్యానికి రక్ష అని వ్యవసాయ అనుబంధకులు నినాదాలు చేశారు. మండలంలోని చిదిమి గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందన్నారు. విత్తనాలను బీజామృతంతో శుద్ధిచేసి నాటుకోవడం వల్ల తెగుళ్ల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ర్యాలీలో చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ మారుతీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

- సీతంపేట: నవధాన్యాల సాగుపై శంబాంలో మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. మాస్టర్ ట్రైనర్ మహేష్ మాట్లాడుతూ ప్రతీ రైతు నవధాన్యాలను సాగు చేయాలన్నారు. దీని వలన పొలంలో సేంద్రీయ కర్బనం పెరుగుతుందని, తద్వారా పంటలకు ఎటువంటి రసాయిన ఎరువులు వాడాల్సిన అవసరం రాదన్నారు. కార్యక్రమంలో యాంకర్ బి.నరేష్, ఏబీసీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం: చిదిమిలో అవగాహన ర్యాలీ



సీతంపేట: శంబాంలో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

- దిశ డీఎస్పీ హర్షిత చంద్ర



మాట్లాడుతున్న దిశ డీఎస్పీ హర్షిత చంద్ర

వీరఘట్టం: అమ్మగా, అక్కగా, చెల్లిగా, ఆలిగా అడుగడుగునా ఆత్మీయతను పంచే అద్భుతమూర్తిగా సమాజంలో మహిళకు సముచిత స్థానం ఉందని, మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి చెందుతుందని పార్వతీపురం మన్యం జిల్లా దిశ డీఎస్పీ హర్షిత చంద్ర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కనోషియన్ డాటర్స్ సోషల్ సర్వీస్ సొసైటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. మహిళలు ఒకరిపై ఆధార పడకుండా ఉండాలంటే ఉన్నత చదువులు చదివి లక్ష్యాలను సాధించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన దిశ చట్టం పూర్తి స్థాయిలో అమలవుతుండడం మహిళలు అదృష్టంగా భావిస్తున్నారన్నారు. ఈ చట్టం వల్ల మహిళలు స్వేచ్ఛగా తమ విధులు నిర్వర్తించగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్.ఐ ఎం.హరికృష్ణ, కనోసా ఆస్పత్రి సిబ్బంది, ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ సునీల్ జోషఫ్‌తో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

భూసర్వేలో సమస్యలుంటే తెలియజేయండి

గుమ్మలక్ష్మీపురం: జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా చేస్తున్న భూముల సమగ్ర రీసర్వేలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ జె.రాములమ్మ కోరారు. మండలంలోని రాయగడజమ్ము పంచాయతీ పాములగీసాడ గ్రామంలో మంగళవారం గిరిజన రైతులతో సమావేశం నిర్వహించారు. భూసర్వేలో సర్వే నంబర్లు తప్పుగా నమోదవడం, పేర్లు మారటం, భూ విస్తీర్ణం తగ్గడం, లేదా పెరగటం వంటి ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటిని తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సర్పంచ్ పత్తిక అమల, గ్రామ సచివాలయం సర్వేయర్, వీఆర్వో ఉన్నారు.

వైభవంగా డోలోత్సవం



భామిని: దేవతా మూర్తులను పూల పల్లకిలో తీసుకొస్తున్న భక్తులు



కురుపాం: జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని లివిరిలో గ్రామంలో వెలసిన గోపీనాథ రాధాకృష్ణ ఆలయంలో మంగళవారం డోలోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు కామదహన కార్యక్రమంతో ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- కురుపాం: మండల కేంద్రంలోని శివన్నపేట గ్రామంలో జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో హోలీ సందర్భంగా మంగళవారం డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



కొమరాడ: చినఖేర్జిల్లో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్



పాలకొండ: కొండాపురంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కమలనాథ్

కొమరాడ: మండలంలోని కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి చినఖేర్జిల గ్రామల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ అరుణ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం స్థానిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్నవారికి ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు.

కొండాపురంలో..

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ఎన్.దేవి, హెల్త్‌అసిస్టెంట్ ఆర్.శ్రీనివాసరావు, ఏఎన్ఎం కుమారి, ఆశా వర్కర్లు సేవలందించారు.

120 మందికి కంటి పరీక్షలు



వైద్య పరీక్షలకు వచ్చిన రోగులకు ఆహారం అందిస్తున్న నవజీవన్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ రమణమూర్తి

భామిని: స్థానిక పీహెచ్‌సీలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద మంగళవారం నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం శిబిరాన్ని ప్రారంభించారు. 120 మందికి కంటి పరీక్షలు చేయగా.. వారిలో 42 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. డాక్టర్ కె.సోయల్, ఆప్తాల్మిస్ట్ జానకిరామయ్య వైద్య సేవలందించారు. నవజీవన్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ ఎస్.వి.రమణమూర్తి, సీహెచ్‌ఓ భాస్కరరావు, పారామెడికల్ సిబ్బంది సహకరించారు.

క్రికెట్ టోర్నీ విజేత కొత్తూరు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై నీలకంఠరావు

సీతంపేట: మండల కేంద్రంలో గత నెల 14 నుంచి నిర్వహించిన మల్లెమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ టోర్నీలో కొత్తూరుకు చెందిన తరుణ్ థండర్స్ జట్టు విజేతగా నిలవగా.. మల్లి లైన్‌మెన్ జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. సీతంపేట, పాలకొండ ఎస్సైలు నీలకంఠరావు, శివప్రసాద్ చేతులమీదుగా విజేతలకు రూ.15 వేలు, రన్నర్స్‌కు రూ.7500 నగదు బహుమతిని నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా జాన్‌ఫాస్టర్, మ్యాన్‌ఆఫ్ దీ సిరీస్ అవార్డును బిడ్డిక శ్రీనివాసరావు దక్కించుకున్నారు.

ఎంఎంఎస్‌కు అవార్డు

వీరఘట్టం: మండలంలోని అన్ని మహిళా సంఘాలను ప్రగతి పథంలో నడిపించిన మండల మహిళా సమాఖ్యకు జిల్లా స్థాయిలో ఉత్తమ సమాఖ్యగా ఎంపికైంది. విజయవాడలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాతకు ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నట్లు ఏపీఎం శివున్నాయుడు తెలిపారు. ఉత్తమ అవార్డు రావడంతో తమపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి

పాలకొండ రూరల్: సచివాలయ స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారంపై సిబ్బంది దృష్టిపెట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పనుకువలస సచివాలయాన్ని ఈఓపీఆర్డీ సత్యంతో కలిసి మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల బట్వాడా, అర్హుల జాబితాల ప్రదర్శన, స్పందన వినతుల పరిష్కారంపై ఆరా తీశారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వీపీరాజుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

కొండవాడ ఎంపీటీసీ స్థానానికి త్వరలో ఎన్నిక

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ ఎంపీటీసీ ప్రాదేశిక సభ్యుడు బిడ్డిక సూర్యం రాజీనామా చేయటంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు త్వరలో ఎన్నిక జరుగనుంది. ఈ నేపథ్యంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు మంగళవారం సమీక్ష నిర్వహించారు. కొండవాడ ఎంపీటీసీ ప్రాదేశికంలో కొండవాడ, లక్కగూడ గ్రామాల్లో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని, ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ రాగానే నామినేషన్లు స్వీకరించి ఎన్నిక నిర్వహిస్తామన్నారు.